



హిందూపురం ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

- ఈద్గాల్లో ముస్లిముల ప్రత్యేక ప్రార్థనలు
- పలువురి శుభాకాంక్షలు




పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి అనంతపురం వ్యాప్తంగా బక్రీద్ వేడుకలను ముస్లిములు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం ఉదయాన్నే కొత్త దుస్తులు ధరించి ఈద్గా మైదానాలకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. సర్వమానవాళి శాంతి, సుఖ సంతోషాలతో మెలగాలని కోరుకున్నారు. ప్రార్థనల అనంతరం ఖుర్బానీ ఇచ్చి మాంసాన్ని పంపిణీ చేశారు. అనంతపురం నగరంతో పాటు గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు, సత్యసాయి జిల్లాలో హిందూపురం, పెనుకొండ, కదిరి, ధర్మవరం పట్టణాల్లోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు ముస్లిములకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావంతో పండుగలను అందరూ కలిసిమెలసి చేసుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీ అంబికా లక్ష్మినారాయణ ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కందికుంట వెంకటేశ్వరప్రసాద్, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తదితరులు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరింది. టిడిపి ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టింది. ప్రభుత్వం మారడంతో ప్రభుత్వ శాఖల ప్రక్షాళన దిశగా అడుగులు పడుతున్నాయి. జిల్లా నుంచి మండల స్థాయి వరకు దాదాపు అన్ని శాఖల్లో అధికారులకు స్థానచలనం తప్పదనే చర్చ ఉద్యోగ వర్గాల్లో నడుస్తోంది. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర ముఖ్య శాఖల్లో అధికారుల మార్పు జరుగుతుందనే ప్రచారం నడుస్తోంది. ఈ సమయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులకు బదిలీల ఫీవర్ పట్టుకుంది. ఉద్యోగులు ఏదో ఒక విధంగా తమకు అనుకూలమైన చోట పోస్టింగ్ తెచ్చుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుని నచ్చిన స్థానంలో ఉద్యోగం పొందేలా పావులు కదపుతున్నారు.



అధికారులకు

స్థానచలనం తప్పదా..?

- 'అధికార' మార్పుతో చాలా శాఖల్లో మార్పులు
- జిల్లాకు వచ్చేందుకు పాతవారి ప్రయత్నం
- మొదలైన పైరవీల పర్వం
- ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే యత్నాలు

ప్రజాశక్తి - అనంతపురం

జిల్లాలోని పలు శాఖల్లో అధికారులకు బదిలీల ఫీవర్ పట్టుకుంది. నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఆయా శాఖల్లో వారికి అనుకూలమైన వారిని తెచ్చిపెట్టుకునేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పావులు కదుపుతున్నారు. జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలతో పాటు 14 అసెంబ్లీ స్థానాల్లో కూటమి విజయం సాధించింది. మంత్రి వర్గ విస్తరణ కూడా పూర్తయ్యింది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి మూడు మంత్రి పదవులు దక్కాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తెసుకెళ్లాలంటే తమకు అనుకూలంగా ఉండే అధికారులు ఆయా స్థానాల్లో ఉంటే మేలను ప్రజాప్రతినిధులు ఆలోచిస్తున్నారు. దీనికి తోడు గతంలో పని చేసిన కొందరు అధికారులు వైసిపికి మద్దతుగా ఉన్నారనే భావన చాలా ప్రస్తుతం టిడిపి నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో ఉంది. ఇప్పటి నుంచే తమకు అనుకూలంగా ఉన్న వారిని నియమించుకుంటే పాలనలో పట్టు సాధించవచ్చనే భావనలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ఎన్నికల సమయంలో అంతర్గతంగా సలహాలు ఇచ్చిన వారికి, సామాజిక వర్గం పరంగా తమకు అనుకూలంగా ఉన్న వారిని వారి నియోజకవర్గంలోకి తెచ్చుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.

ప్రభుత్వం మారిన తర్వాత ఎమ్మెల్యేల బదిలీలపై దృష్టి సారిస్తుండడంతో అధికారులు, ఉద్యోగులకు బదిలీల జ్వరం పట్టుకుంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం పలు కీలక ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కొందరు అధికారులు, సిబ్బందిని మార్చాలని రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన టిడిపి ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ దిశలోనే ఐఎఎస్, ఐపిఎస్ ముఖ్య అధికారులకు స్థానం చలనం చేసే దిశగా ప్రభుత్వం పెద్దలు చర్యలకు ఉపక్రమించారు. ఆయా నియోజక వర్గాల్లో స్థానికంగా నచ్చనివారిని పంపించి తమకు అనుకూలంగా ఉన్న వారిని తెచ్చుకునే ప్రయత్నంలో నేతలు పావులు కదుపుతున్నారు. ప్రధానంగా రెవెన్యూ, పోలీసు, మున్సిపాల్టీ శాఖల్లో అధికారుల మార్పు తప్పని సరిగా కన్పిస్తోంది. పోలీసు, రెవెన్యూ శాఖల్లో పూర్తిగా మార్చి తమకు అనుకూలంగా ఉన్న వారిని తెప్పించుకునేలా ఆయా ఎమ్మెల్యేలు జాబితాలు సిద్ధం చేసుకున్నారు. ఇదే సమయంలో అధికారులు కూడా వారికి నచ్చిన ప్రాంతంలో పోస్టింగ్‌లు తెచ్చుకోవడం కోసం పైరవీలు ప్రారంభించారు. తమకు తెలిసిన ముఖ్య నేతలతో బదిలీలకు సిఫార్సులు చేయించు కుంటున్నారు. కొందరు అధికారులు మాత్రం తమ స్థానాలను కాపాడుకునేందుకు ప్రజాప్రతినిధులతో రాయబారాలు చేస్తున్నారు. మరో నెల రోజుల్లో అన్ని శాఖల్లోనూ దాదాపు ఇప్పుడున్న అధికారుల స్థానంలో కొత్త వారు వచ్చే అవకాశాలు మాత్రం స్పష్టంగా కన్పిస్తున్నాయి.

నేడు కరువు బృందం రాక

19న రబీ -2023-24 కరువును పరిశీలించనున్న ఐఎంసిటి టీం

ప్రజాశక్తి- అనంతపురం

2023-24 రబీ సీజన్‌లో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు కరువు బందం(ఐఎంటిసి) బృందం మంగళవారం నాడు అనంతపురం జిల్లాకు చేరుకోనున్నారు. 19వ తేదీ ఉదయం రాష్ట్ర స్థాయి రబీ 2023-24 కరువుపై సమీక్షా సమావేశాన్ని అనంతపురం రెవెన్యూ భవన్‌లో నిర్వహించనున్నారు. ఇందులో ఒక బృందం సత్యసాయి జిల్లాకు వెళ్తుంది. రెండవ బృందం కర్నూల్ జిల్లా పర్యటనకు వెళ్లుంది. 20న ఒక బృదం అనంతపురం జిల్లాలోని ఉరవకొండ నియోజకవర్గంలో పప్పుశనగ సాగుచేసిన మండలాలు వజ్రకరూరు, విడపనకల్, ఉరవకొండ, కనేకల్ మండలంలో పర్యటిస్తుంది. ఉమ్మడి జిల్లా పర్యటన అనంతరం 20వ తేదీ సాయంత్రం విజయవాడకు బృందం వెళ్తుంది. కరువు బృదంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాకు సంబంధించి మొదటి బృందంలో రితేష్ చౌహాన్, డా॥ కె.పొన్నుసామి, డి.సునీల్ దూబే, 2వ బృందంలో చిన్మయ్ గోత్మరే, ఆశిష్ పాండే అరవింద్ కుమార్ సోని, 3వ బృందలో మన్ను జీ ఉపాధ్యాయ్, కశ్యప్, మదన్ మోహన్ మౌర్య, అనురాధ బటానాలు ఉన్నారు. కరువు బృందం పర్యటన నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

మంత్రి సవితకు శుభాకాంక్షల వెల్లువ



విజయవాడలో మంత్రి సవితకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

బిసి సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం, చేనేత పరిశ్రమ శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పెనుకొండ ఎమ్మెల్యే సవితకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పెనుకొండ నియోజకవర్గం నుంచి పలువురు అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు విజయవాడకు వెళ్లి అభినందనలు తెలిపారు. అలాగే సంబంధిత శాఖల అధికారులు సవిత స్వగృహంలో పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. పెనుకొండ నియోజకవర్గం నుంచి మొదటి సారి పోటీ చేసి ఘన విజయం సాధించి మంత్రి పదవి దక్కడంతో స్థానిక నాయకులు ఆమెను కలవడానికి పెద్ద ఎత్తున తరలివెళ్తున్నారు. సోమవారం గోరంట్ల మండలానికి చెందిన టిడిపి యువ నాయకులు కమలాకర్, నిమ్మల యువశేఖర్, జనసేన నాయకులు సంతోష్, పెనుకొండ నుంచి సిపిఐ నాయకులు శ్రీరాములు, ఆదినారాయణ, గుట్టూరు టిడిపి నాయకులు ఆదిశేషు, నాగరాజు, పిఆర్ ఇంజినీర్లు జగదీష్, గోపాల్‌నాయక్, ఉన్నతాధికారులు మంత్రికి శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించి స్వీట్లు పంచిపెట్టారు. అలాగే బిసి సంక్షేమ, చేనేత శాఖల అధికారులు మంత్రికి పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పేరుతో డబ్బులు వసూలు చేస్తే ఉపేక్షించం
- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల

ప్రజాశక్తి-మడకశిర



ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమలకు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న డిఎంహెచ్ఓ మంజువాణి

మడకశిర నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలోని ఆర్అండ్‌బి విశ్రాంతి భవనంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామ స్థాయిలో డెవలప్మెంట్ కమిటీని ఏర్పాటు చేస్తామ న్నారు. అందులో 10 నుంచి 15 మంది సభ్యులు ఉంటారని వారే క్షేత్రస్థాయిలో నిర్ణయం తీసుకునే అధికారం ఇస్తున్నామన్నారు. మీ నాయకత్వం ఎంత బలపడితే టిడిపి అంత బలపడుతుందని వారు తెలిపారు. నియోజకవర్గంలో కక్ష సాధింపులు వద్దని, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం అన్నారు. గత ఐదేళ్లలో వైసిపి అధినేత, నాయకులు ఎన్నో మాటలు అన్నారని, నేడు వారి పరిస్థితి ఎలా ఉందో ఒకసారి గుర్తించుకోవాలన్నారు. వల్లభనేని వంశీ, కొడాలి నాని, అనిల్‌కుమార్‌యాదవ్‌తో పాటు అనేక మంది భవిష్యత్తు ఏంటో వారికి అర్థమైందన్నారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేసుకుని వారికి జవాబుదారీతనంగా పని చేసినప్పుడే తగిన గుర్తింపు వస్తుందన్నారు. గ్రామస్థాయిలో అందరూ ఐకమత్యంగా ఉండాలని, క్షేత్రస్థాయి నుంచి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామన్నారు. తక్కువ సమయం ఉన్నా తన గెలుపు కోసం ఎంతో కష్టపడి పని చేశారని, మీ రుణాన్ని తీర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, పట్టణ, మండల కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్, కౌన్సిలర్లు నరసింహారాజు, శ్రీనివాసులు, హనుమంతు, శీనప్ప, తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు, కల్లుమర్రి సర్పంచి నాగరాజు, అక్కంపల్లి బాబు, ఐదు మండలాల కన్వీనర్లు, కార్యకర్తలు, నాయకులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలకు పలువురి అభినందనలు

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సోమవారం అధికారులు, నాయకులతో బిజీబిజీగా గడిపారు. వారు టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్అండ్‌బి విశ్రాంతి భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా, మండల స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ బిజీబిజీగా గడిపారు. డిఎంహెచ్ఓ మంజువాణి ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమలను కలిసి వారికి పూలబొకేలు అందజేసి శాలువాలతో సన్మానించారు. అలాగే పలువురు ఎమ్మెల్యేని కలిసి శాలువా కప్పి పూలమాల వేసి సన్మానించారు. నియోజకవర్గంలోని రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపారు.

దాడుల సంస్కృతి వైసిపిదే : టిడిపి

గోరంట్ల : ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసే విష సంస్కృతి వైసిపి నాయకులకే చెల్లుతుందని మండల జనసేన, టిడిపి నాయకులు పేర్కొన్నారు. గత శనివారం రాత్రి వానవోలు గ్రామపంచాయతీ ఉపసర్పంచి బుల్లెట్ బాబు ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు విసిరిన ఘటనకు సంబంధించి మాజీ మంత్రి శంకర నారాయణ బుల్లెట్ బాబును పరామర్శించడానికి వచ్చి బుల్లెట్ బాబు ఇంటిపై కూటమి నాయకులు దాడులు చేశారని అసత్య ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో జనసేన, టిడిపి నాయకులు సమావేశమై మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకూ వైసిపి అధికారంలో ఉన్నప్పుడు మాజీ మంత్రి శంకర నారాయణ గోరంట్ల మండలంలో భూ కబ్జాలు చేయడంతో దౌర్జన్యంగా రైతులను భయపెట్టి భూములు లాక్కున్నారన్నారు. ఆ భూమిని కాపాడుకోవడానికే గోరంట్ల మండలంలో కూటమి నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైసిపి అధిష్టానం మెప్పు పొంది మరోమారు పెనుకొండ నియోజకవర్గానికి ఇన్‌ఛార్జి పదవి కోసమే ఆయన ఇలా ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసిపి హయాంలో జర్నలిస్టులు, దళితులు, టిడిపి నాయకులపై వైసిపి నాయకులు బహిరంగంగా దాడులు చేసి మళ్లీ బాధితులపైనే తప్పుడు కేసులు పెట్టారన్నారు. కూటమి నాయకులపై లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని శంకరనారాయణను కూటమి నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు దేవా నరసింహప్ప, పసుపులేటి శ్రీనివాసులు, ఉత్తమరెడ్డి, నరసింహులు, రాజారెడ్డి, మాజీ సర్పంచి సుధాకర్‌రెడ్డి, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు

కేశవ్‌కు 'అనంత' స్వాగతం

- తొలిసారి జిల్లాకు వచ్చిన నేతకు గ్రాండ్‌వెల్‌కమ్
- గుత్తి నుంచి ఉరవకొండ వరకు రోడ్‌షో
- మంత్రిని అయినా జిల్లాకు కూలీనే : పయ్యావుల



పయ్యావులకు స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు (ఇన్‌సెట్‌లోఅభివాదం చేస్తున్న కేశవ్)

ప్రజాశక్తి-అనంతపురం, గుత్తి, పామిడి,

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా జిల్లా ఇచ్చేసిన పయ్యావుల కేశవ్‌కు అభిమాన స్వాగతం లభించింది. సోమవారం ఉదయం ఆయన రోడ్డు మార్గాన విజయవాడ నుంచి గుత్తికి చేరుకున్నారు. జిల్లా సరిహద్దులోని గుత్తి బాట సుంకలమ్మ ఆలయం వద్ద ఆయనకు టిడిపి శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, జెసి.అస్మిత్ రెడ్డి, గుమ్మనూరు జయరాం, ఎంఎస్.రాజు, అనంతపురం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జి.వెంకట శివుడు యాదవ్‌తో పాటు టిడిపి నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి సుంకులమ్మ గుడిలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గుత్తి పట్టణానికి చేరుకుని మహాత్మా గాంధీ, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అక్కడి నుంచి రోడ్‌షోగా గుత్తి, పామిడి, గార్లదిన్నె, అనంతపురం, కూడేరు మీదుగా ఉవకొండకు చేరుకున్నారు. అడుగడుగునా కేశవ్‌కు టిడిపి అభిమానులు ఘన స్వాగతం లభించారు. క్రేన్ల సాయంతో గజమాలతో ఆయన్ను సత్కరించారు. అభిమానులకు విక్టరీ సంకేతం చూపుతూ మంత్రి రోడ్‌షోను కొనసాగించారు. పలుప్రాంతాలో ఆయన టిడిపి శ్రేణులకు ఉద్దేశించి ప్రసంగించారు. అనంతపురం తపోవనం దగ్గర ఎమ్మెల్యే దగ్గుప్రసాద్ ఆధ్వర్యంలో ఒంటెలు, గుర్రాలు, గురవయ్యలతో స్వాగతం పలికారు. కాన్వాయ్‌పై పూలవర్షం కురిపించారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాం మంత్రిని అయినా జిల్లాకు కూలీనే..! పయ్యావుల కేశవ్

ప్రజలు ఎంతో విశ్వాసంతో టిడిపి ప్రభుత్వానికి ఎన్నికల్లో అఖండ మెజార్టీని ఇచ్చి అధికారంలోకి కూర్చోబెట్టారని, వారి ఆకాంక్షల మేరకు రాష్ట్రంలో పాలన ఉంటుందని రాష్ట్ర ఆర్థిక శాఖ, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ తెలియజేశారు. రోడ్‌షో సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనపై నమ్మకంతో ఆర్థిక శాఖను అప్పగించారని తెలిపారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన శాఖ ద్వారా ప్రజలకు మేలు చేస్తానన్నారు. ఇంకా ఆర్థిక శాఖకు సంబంధించి ఖజానా పుస్తకాలు తెరవలేదని, గత ఐదేళ్లలో ఏమి జరిగిందో తెలుసుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్రానికి మంత్రిని అయినా అనంత జిల్లాకి తాను కూలీగానే పని చేస్తానని చెప్పారు. టిడిపి ప్రభుత్వం హయాంలో రాష్ట్రాన్ని అభివద్ధి పథంలో పరుగులు పెట్టిస్తామన్నారు. తాను ఆరాటాలు, పోరాటాల మధ్య పెరిగానన్నారు. రైతులు, కార్మికులు, ప్రజలందరి కష్టాలు తనకు తెలుసున్నారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో సాగు, తాగునీటి కోసం అనేక పోరాటాలు చేశానని తెలిపారు. భవిష్యత్తులో ప్రజలందరి ఆకాంక్షలను నెరవేరుస్తూ వారికి నచ్చే పాలనను కొనస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ, సర్పంచి పి.భరత్ కుమార్, ఎంపీటీసీలు ధనుంజయ, నారాయణస్వామి, నాయకులు ఎంకె.చౌదరి, ఎన్.కేశవ నాయుడు, రవితేజ నారాయణస్వామి, పి.రవితేజ, ఎన్.సూర్యప్రతాప్, దిల్కాశీనా, ఎస్.అబ్దుల్ జిలానీ, డాక్టర్ వి.నాగేంద్ర, ఎస్ఎం.బాషా, పి.సుధాకర్, చిన్న వెంకటస్వామి, పిల్లెల్లి కష్ణయ్య పాల్గొన్నారు.



అనంతపురంలో గజమాలతో కేశవ్‌కు స్వాగతం పలుకుతున్న టిడిపి అభిమానులు

హెచ్ఎల్‌సి కాలువ పరిశీలన

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని హెచ్ఎల్‌సి కాలువ పలుచోట్ల కోతకు గురై గండ్లు పడ్డాయి. ఆయా ప్రదేశాలను, ప్రధాన కాలువను సోమవారం సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజశేఖర్ ఈఈ, కణేకల్ సెక్షన్ డివిజనల్ ఇంజినీర్‌తో కలిసి 119వ కిలోమీటర్ వద్ద కాలువను పరిశీలించారు. కాలువ గట్లు కోతకు గురవడాన్ని గమనించి మరమ్మతులకు అంచనాలను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఎస్ఈ తెలిపారు. వారితో పాటు హెచ్ఎల్‌సి సిబ్బంది ఉన్నారు.

ప్రజాశక్తి www.prajasakti.com

క్షతగాత్రుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని రాగన్న గారిపల్లికి చెందిన మదన్మోహన్ రెడ్డి అనే వ్యక్తి బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. సర్జరీకోసం రూ.15 లక్షలదాకా అవుతుందని డాక్టర్లు చెప్పారు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర బిసి విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ స్పందించారు. వెంటనే తనవంతు సాయంగా క్షతగాత్రుడికి రూ.24వేలను అందజేశారు.

విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి నల్లచెరువు

మండల పరిధిలోని కమ్మవారి పల్లిలో నాగ గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా బెంగుళూరుకు చెందిన అయ్యప్ప నాగేశ్వరరావు ఉత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన శేఖర్ రెడ్డి స్థలం విరాళంగా ఇచ్చినట్లు చెప్పారు.

విశ్రాంత డ్రైవర్ నిజాయితీ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఎపిఎస్ ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన సుబ్బరాయుడు తన నిజాయితీని చాటుకున్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఉదయం నడకకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకువెళ్లారు. కళశాల ప్రాంగణంలో విలువైన ఆండ్రాయిడ్ ఫోన్ దొరికింది. అందులో వున్న ఫోటో ఆధారంగా నడకలో వున్న ఉపాధ్యాయుడు క్రిష్ణమూర్తిని అడిగి వివరాలు సేకరించారు. ఆ ఫోన్ తలుపుల మండలం గుండువారిపల్లిలో ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న మునిస్వామిగా తెలిసింది. వెంటనే అతనికి ఫోన్ ద్వారా సమాచారం అందించిఉదయపు నడక చేస్తున్న తోటి ఉద్యోగులైన హరిమోహన్, సురేంద్ర,రమణ,రామచంద్ర సమక్షంలో మునిస్వామికి ఫోన్‌ను అందజేశారు. సర్వీసులో వుండగా క్రమశిక్షణ, నిజాయితి కనబరచిన సుబ్బరాయుడు ఉద్యోగ విరమణ పొందిన తరువాత కూడా తన నిజాయితీని చాటి, ఆర్టీసీ పేరును నిలబెట్టాడనిఅసిస్టెంట్ మేనేజరు హరిమోహన్ తెలిపారు.

20న ఉచిత గుండె వైద్యశిబిరం

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల కేంద్రంలో సాయిబాబా ఆలయ ట్రస్టు అధ్వర్వంతో మదనపల్లికి చెందిన శ్రీ వేంకటేశ్వర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రశాంత్ నగర్‌లో వుండే ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ బాలకిషోర్ వారి సహకారంతో నల్లచెరువు సాయిబాబా ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - నల్లచెరువు

నల్లచెరువుకు చెందిన భాస్కర్ నాయుడు విద్యాశాఖ మంత్రినారా లోకేష్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. టిడిపి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఆకర్షితుడై ఆపార్టీలో చేరుతున్నట్లు భాస్కర్‌నాయుడు తెలిపారు.

ఆలయ కమిటీ సభ్యులు రాజీనామా

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, నూతన ప్రభుత్వం నామినేడెడ్ పదవులను రద్దు చేస్తు ఉత్తర్వులను వెల్లడించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారం పట్టణంలో వెలసిన పేట వెంకటరమణ స్వామి ఆలయ కమిటీ చైర్మేన్ నవీన్ చంద్ర, మెంబర్లు లక్ష్మీదేవి, భారతీ, రత్న, చంద్రమోహన్, గోపాల్, రామ్మూర్తిలు ధర్మకర్తల మండలికి తమ పదవులకు రాజీనామా చేసినట్లు ఈవో నరసింహమూర్తి తెలిపారు.

సకాలంలో వైద్యసేవలందాలి : మంత్రి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రోగులకు సకాలంలో వైద్యసేవలందించాలని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం తిరుపతిలోని రుయా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో ప్రతివార్డు తిరుగుతూ రోగుల సమస్యలను ఆడిగితెలుసుకున్నారు. ఆస్పత్రిలో భోజనం, మందులను సక్రమంగా అందిస్తున్నారా అని రోగులను అడిగితెలుసుకున్నారు. పేదలకు సరైన సమయంలో వైద్యచికిత్సలు అందించాలని, పేదల వైద్యం పట్ల ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని అక్కడి వైద్యులకు మంత్రి సూచించారు.

డ్రైయినేజీ సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి పురవీధులలో డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనక భాగాన ఉన్న ఒక కాలనీలో డ్రయినేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ సందర్భంగా ఆ కాలనీవాసులు మాట్లాడుతూ వర్షాకాలం వస్తే డ్రైనేజీ పొంగిపొర్లి ఒక్కొక్కసారి ఇళ్లలోకి కూడా చేరుతుందన్నారు. దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లిన సమస్య పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కొందరు అక్రమంగా కట్టడాలు కట్టడం వల్ల వర్షం నీరు చిత్రావతి నదిలోకి వెళ్లకుండా అన్ని డ్రైనేజీ చాంబర్లలో నిండిపోతుందని దీంతో ఈ సమస్య వస్తుందని అన్నారు. గతంలో రెండు మూడు సార్లు ఇలాగే జరిగిందని సమస్య పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చేనేత సమస్యల పరిష్కారానికి కృషి : పరిటాల శ్రీరామ్



చేనేత కార్మికుల కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ఫిబ్రవరిలో నారా భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ధర్మవరం పట్టణంలో చేనేత కుటుంబాలను పరామర్శించి అధికారంలోకి రాగానే వారికి అండగా ఉంటామని భరోసా కల్పించింది. నారా భువనేశ్వరి ఇచ్చిన హామీ మేరకు పరిటాలశ్రీరామ్ చేనేత కుటుంబాలను సోమవారం కలిసి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ ఐదేళ్లలో చేనేతలు తీవ్ర దుర్భిక్షపరిస్థితులను ఎదుర్కొన్నారన్నారు. వైసీపీప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదని, దీనికి తోడు ముడిసరుకులు రెట్టింపు అయ్యాయని, నేసిన చీరలకు గిట్టుబాటు ధర కూడా రాలేదని చేనేతలు పరిటాల శ్రీరామ్‌కు వివరించారు. చేనేతల సమస్యలు విన్న అనంతరం పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేనేతల అన్ని విధాలా అదుకుంటారని భరోసా ఇచ్చారు. గత టీడీపీ హయాంలో ఉన్న పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ప్యాన్స్ కన్వీనర్ ఎల్.నరేంద్రచౌదరి, టీడీపీ పట్టణఅధ్యక్షులు పరిశేసుధాకర్, పురుషోత్తంగౌడ్, చింతపులుసు పెద్దన్న, అంబటిసనత్, ఊట్లనరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే భూమిపూజ

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేస్తున్న శ్రీకృష్ణ దేవరాయ విగ్రహ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు అన్ని వర్గాల సంక్షేమాన్ని భవిష్యత్తు తరాల్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. అలాంటి వ్యక్తి విగ్రహాన్ని బలిజ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. విగ్రహ ఏర్పాటుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భైరవ ప్రసాద్, బ్లూమూన్ విద్యా సంస్థల అధినేత, బలిజ సంఘం నాయకులు మంచి శివశంకర్, బలిజ సంఘం అధ్యక్షులు రమేష్ బాబు, కందుకూరు నాగరాజు, చింత శ్రీనివాసులు, శ్రీనివాసులు, అన్నం జనార్దన్, పసుపులేటి సురేష్ కుమార్, చలపతి, అడ్వకేట్ శివ శంకర్, నాగేంద్ర ప్రసాద్, బైరిశెట్టి, సుంకర రవీంద్ర, మల్లెం మోహన్, వీరశంకర్, కటారు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ధర్మవరానికి మంత్రి రాక

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రాష్ట్ర వైద్యఆరోగ్య కుటుంబసంక్షేమ వైద్యవిద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తొలిసారిగా సొంత నియోజకవర్గం ధర్మవరానికి మంగళవారం రానున్నారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొట్టమొదటి సారిగా నియోజకవర్గానికి వస్తుండటంతో ఎన్‌డిఎ శ్రేణులు భారీగా స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌తో కలసి మంత్రి వస్తున్నందు వల్ల ఈ కార్యక్రమం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. మంగళవారం ఉదయం అనంతపురం నుంచి రోడ్డు మార్గాన బతలపల్లి మండలం యర్రాయపల్లి వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి భారీ ఎత్తున వాహనాలర్యాలీతో బత్తలపల్లి మీదుగా గొట్లూరుకు చేరుకుంటారు. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం బైకు ర్యాలీతో ధర్మవరం పట్టణంలోకి అడుగు పెడతారు. కదిరిగేటు వద్ద చేనేత విగ్రహానికి పూలమాల వేసి తేరుబజారుగా మీదుగా దుర్గమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి కళాజ్యోతి సర్కిల్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి దుర్గానగర్ ఎదురుగా ఉన్న నూతనంగా నిర్మించిన ప్రభుత్వాస్పత్రి ఆవరణంలో మంత్రి చేతులమీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అనంతరం ఎన్డీఏ కూటమి కార్యాలయానికి చేరుకుం టారు. ఇందుకోసం కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఏర్పాట్లు చేశారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో సోమవారం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు రాధా సహకారంతో అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు చిరంజీవి నిర్విఘ్న, శిరీష్ వీర, సౌదామణి, సుబ్రమణ్యం, ఓబుళపతి, నల్లప్ప, జగన్నాథ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'పాంచజన్య' వార్షికోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ పాఠశాల 22వ వార్షికోత్సవ వేడుకలతో పాటు పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు జన్మదిన వేడుకలను సోమవారం రాత్రి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల నడుమ ఘనంగా నిర్వహించారు. పాఠశాల అధ్యక్షులు శ్రీనివాసులు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి గంగప్ప, ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు వేణుగోపాల్, రీయాజ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో 10 సంవత్సరాలు విధులు నిర్వహించిన సిబ్బందికి సన్మానించి, నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎంఇఒ గంగప్ప మాట్లాడుతు పట్టణంలో కొన్ని విద్యా సంస్థలు సంపాదనకోసమే స్థాపించారన్నారు. అయితే ఎటువంటి లాభాపేక్ష లేకుండా సేవకోసమే శ్రీనివాసులు విద్యాలయాన్ని స్థాపించి ఎంతో మందికి విద్యాదానం చేస్తు పాఠశాలలో ఉన్నత మార్కులు సాధించిన వారికి ఉన్నత చదువులకు స్కాలర్ షిప్ అందించడం అభినందనీయం అన్నారు. అనంతరం పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ 21 సంవత్సరాల క్రితం ఒక ఆశయంతో పాఠశాలను స్థాపించడం జరిగిందన్నారు. నాటినుంచి నేటి వరకు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతో పాటు సామాజిక సేవలో సైతం వారిని భాగ్యస్వాములు చేసి సమాజాభివృద్ధికి సైతం ఉపయోగపడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. పాఠశాలలో ఎక్కడాలేని విధంగా విద్యార్థులు కోసం యోగా, వ్యాయామ, గేమ్స్, స్పోర్ట్స్ లో సైతం తీర్చిదిద్దుతున్నామన్నారు. పాఠశాలకు అనుసందానంగా ట్రస్టును ఏర్పాటు చేసి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఉన్నత విద్యకు తమ వంతు సహాకారం అందిస్తున్నామన్నారు. పాఠశాల వార్షికోత్సవం, పాఠశాల అధ్యక్షులు శ్రీనివాసులు ఒకే రోజు కావడంతో ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా వేడుకలు జరిగేవని అయితే బక్రీద్ పండుగ రావడంతో పాఠశాల సిబ్బంది, కుటుంబ సభ్యుల నడుమ కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షులు సందీప్, సెక్రటరీ నందకుమార్, స్కూల్ డైరెక్టర్లు భారతి శ్రీనివాస్, సత్య, అడ్మినిస్ట్రేటీవ్ డైరెక్టర్ స్మితకృష్ణ, అకాడమిక్ డైరెక్టర్ నందిత సందీప్, ఎఓ భాస్కర్, హెచ్ఎం గాయిత్రి, సుపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, అబ్దుల్ రజాక్, సతీష్ కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న శ్రీనివాసులు



10 సంవత్సరాలు విధులు నిర్వహించిన సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

బాలిక అనుమానాస్పద మృతి

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని చౌడంపల్లికి చెందిన బాలిక అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. గ్రామానికి చెందిన ప్రమీల(16) తరచు ఫోన్ ఎక్కువగా మాట్లాడుతుండగా వారి తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆమె ఆదివారం సాయంత్రం ఇంటినుంచి వెళ్లిపోయింది. బాలిక కుటుంబసభ్యులు ఎంతవెతికినా ఆచూకీ తెలియకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో గ్రామానికి సమీపంలోని చెక్‌డ్యాం వద్ద నీటిలో ప్రమీల మృతదేహం తేలియాడుతుండటాన్ని మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు బాలిక కుటుంబసభ్యులకు సమాచారమందించారు. మృతురాలి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.

ఇద్దరు పిల్లలతో కలిసి గృహిణి అదృశ్యం

లేపాక్షి : మండల పరిధిలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన కురుబ శ్రీనివాసులు భార్య సుధ తన ఇద్దరు కొడుకులతో కలిసి ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎవరికైనా వారి సమాచారం తెలిస్తే 90361 12685 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.



ఇంటినుంచి వెళ్లిపోయిన తల్లీకొడుకులు(ఫైల్)

అనారోగ్యంతో టీడీపీ కార్యకర్త మృతి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవపురానికి చెందిన టీడీపీ కార్యకర్త గంజిగడ్ల చెన్నకేశవ (45) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, టీడీపీ పట్టణ అధ్యక్షులు పరిసేసుధాకర్, 24,25 వార్డుల టీడీపీ అధ్యక్షులు మాధవరెడ్డి, మాదవరెడ్డి తదితరులు చెన్నకేశవ భౌతికాయానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

మాంసం డబ్బుల కోసం ఘర్షణ

నలుగురికి గాయాలు

గుత్తి : మాంసం డబ్బులు విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటన మండలంలోని రజాపురం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామ్‌గోపాల్ నాయుడు పొట్టేళ్ల మాంసం విక్రయించేవాడు. ఇందులో భాగంగానే అదేగ్రామానికి చెందిన యువరాజు, ధనలక్ష్మి అరువుగా మాంసాన్ని తీసుకెళ్లారు. మాంసానికి సంబంధించిన రూ.700 చెల్లించాలని ఇంటి వద్దకు వెళ్లి యువరాజును రామ్‌గోపాల్‌నాయుడు, దినేష్‌నాయుడు అడిగారు. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాల వారు వాదనకు దిగారు. మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో యువరాజ్ సోదరులు వెంకీ, శీనా, కిట్ట, బాలరాజుతో కలిసి తమ కళ్లల్లో కారం చల్లి రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడినట్లు రామ్మోహన్ నాయుడు, దినేష్ నాయుడు వాపోయాడు. అలాగే మరోవర్గానికి చెందిన కృష్ణమనాయుడు, ధనలక్ష్మికి కూడా గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసు నిందితుడు అరెస్ట్

రాయదుర్గం : డి.హీరేహాల్ మండలంలోని మురడి గ్రామంలో ఆదివారం జరిగిన హత్య కేసులో నిందితుడిని 24 గంటల్లోపే అరెస్టు చేసినట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు తెలిపారు. రాయదుర్గం రూరల్ పోలీస్ సిఐ కార్యాలయంలో సోమవారం సాయంత్రం డీఎస్పీ విలేకరుల సమావేశంలో హత్య కేసు వివరాలు వెల్లడించారు. మురడి గ్రామానికి చెందిన హరిజన చిన్నబాబు అలియాస్ యేసురాజు ఆదివారం మధ్యాహ్నం గ్రామంలో చికెన్ షాపు నిర్వహిస్తున్న మురుడప్ప వద్దకు వచ్చి తనకు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని, అలాగే చికెన్ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇందుకు నిరాకరించడంతో యేసుబాబు బండరాయితో మురుడప్ప తలపై బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడిన మురుడప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. మురడప్ప పినతల్లి పెన్నక్క ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడు యేసురాజు డి.హీరేహాల్ మండలంలోని కల్లెం బస్టాప్ వద్ద వేచి ఉండగా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, సిబ్బంది అతడిని అదుపులో తీసుకొని విచారించగా తానే మురుడప్పను హత్య చేసినట్లు అంగీకరించాడు. దీంతో చిన్నబాబు అలియాస్ యేసురాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో డీఎస్పీతో పాటు రాయదుర్గం రూరల్ సిఐ జె.ప్రసాద్‌బాబు, డి.హీరేహాల్ ఎస్ఐ ఎ.గురుప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

జీవో117ను రద్దుచేయాలి


ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

జీవో నెంబర్ 117ను పూర్తిగా రద్దుచేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంతకు ముందు అనుసరించిన జీవో నెంబరు 54 ప్రకారమే పోస్టులు మంజూరుచేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి తప్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా 12వ పీఆర్సీని తక్షణం అమలుచేయాలని, ఉపాధ్యాయ నియామకాలలో అప్రెంటీస్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యావ్యవస్థలో ఒకే సిలబస్ అమలుచేయాలని, 3,4,5 తరగతుల విలీనం రద్దుచేయాలని, సీపీఎస్ రద్దు, యాప్‌ల రద్దు చేయాలని కోరారు. 1998, 2008 టీచర్ల రెగ్యులరైజేషన్ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న కదిరి ఎమ్మెల్యే 'కందికుంట'



ముదిగుబ్బలో ముస్లిముల ప్రత్యేక ప్రార్థనలు



పుట్టపర్తిలో ముస్లిముల ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - హిందూపురం

త్యాగానికి ప్రతీకగా బక్రీద్ అని మౌలానా అబ్దుల్ మన్నన్ అన్నారు. సోమవారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని అహ్మద్ నగర్, బసవనపల్లి మద్రాస ఈ అన్వర్ ఉలూమ్, ఐలే హదీస్ ఈద్గా ఈ వహదియాలో, మద్రాస దారుల్ ఉలూమ్ హుసేనియా, జామియా షంషుల్ ఉలూమ్ పరిగి రోడ్, మద్రాస ఈ నూరుల్ ఇస్లాం మోడల్ కాలనీ, పట్టణంలోని ఆర్ పి జి టి రోడ్డులో ఉన్న జామియా ఈద్గా, శాంతి నగర్ లో ఉన్న ఈద్గా బిలాల్, ముక్కడి పేటలో ఉన్న గౌసియా మసీదు, రహమత్ పూర్ ఈద్గా, నిక్కంపల్లి ఈద్గా, కోటలో ఉన్న అబ్దుల్లా ఈద్గా, మేలాపురం సున్ని ఈద్గా, కొట్నూరు ఈద్గా, మోడల్ కాలనీ ఈద్గా మైదానాలలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానాలు పండుగ విశిష్టత గురించి వివరించారు.

శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు: బక్రీద్ పండుగను పురస్కరించుకుని పలువురు ప్రముఖులు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెఇపారు. టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్, అమర్నాథ్ తో పాటు ఇతర నాయకులు ముస్లీం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. అదే విధంగా జామీయ మసీదు కమిటీ ముత్వల్లీ నూరూల్లా, కమిటీ వారితో పాటు వివిధ మసీదు ముత్వల్లీలు అందరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రక్తదానం : బక్రీద్ పండుగను పురస్కరించుకుని సోమవారం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో ఉమర్ ఫారూక్ ఖాన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యువకులు కుల మతాలకు అతీతంగా హిందూ సోదరులు సైతం ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఉమర్ ఫారూఖ్ ఖాన్, వైద్యులు జక్కా నరేంద్ర, చరణ్, శివ కుమార్, ఉబెదుల్లా హుసేన్, చైతన్య గంగిరెడ్డిలు మాట్లాడుతు త్యాగానికి ప్రతీకగా నిలచిన పండుగ రోజున అన్ని కులాల వారు ఐకమత్యంతో రక్తదానం చేయడానికి ముందుకు రావాడం అభినందనీమన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారందరికి మెమోంటోలు, ప్రశంస పత్రాలతో పాటు షహీద్ టిప్పు సుల్తాన్ రక్త దాత పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఇద్రీస్, రహమాన్, శ్రీనాథ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు కొత్త చెరువులో ఉదయం ముస్లిం సోదరులు ధర్మవరం రోడ్డు నందు ఉన్న ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బుక్కపట్నం : మతసామరస్యానికి ప్రతికైన బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.మండల కేంద్రంలో ర్యాలీగా వెళ్లి ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గాండ్లపెంట : మండలంలోని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలో బక్రీదు వేడుకలను ముస్లీంలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ సమీపంలోని కేతిరెడ్డికాలనీలో గల ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్, ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ఎల్ నరేంద్రచౌదరి ముస్లీం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కదిరి అర్బన్ : ప్రేమ, ఆప్యాయత, సేవాగుణం ముస్లిముల సిద్ధాంతమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గా మైదానంలో సోమవారం జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కందికుంట పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కదిరి షాహమిరియా పీఠాధిపతి జనాబ్ మౌలానా, సయ్యద్ షామీర్ భాష, ఖాద్రి సాహెబ్‌ని, ఆలం ఖాన్ వలి, మసీద్ ఇమామ్ హాఫీజ్ హబీబుల్లా ని, ఇతర మత పెద్దలని కలిసి ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కెఎస్ బహావుద్దీన్, డైమండ్ ఇర్ఫాన్, మున్సిపల్ కౌన్సిలర్లు ఫయాజ్ అలీ ఖాన్, ఆల్ఫా ముస్తఫా, మహబూబ్ బాషా, మాజీ కౌన్సిలర్ కంటిక ఖాదర్ బాషా, తజ్ముల్, ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలో సోమవారం బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. కదిరి గేటు సమీపంలో ఈద్గా మైదానంలోనూ, పాతూరు ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. ప్రార్థన అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పుట్టపర్తి అర్బన్ : బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం మైనార్టీ సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం పట్టణంలో ముస్లింలు మసీదులలో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఒకరికి ఒకరు ముబారక్ తెలుపుకున్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్ తదితరులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

పుట్టపర్తి రూరల్: బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లావ్యాప్తంగా మసీదులు, ఈద్గాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించారు. సోమవారం బక్రీద్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు పోలీసు అధికారులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. కదిరి, హిందూపురం, ధర్మవరం, పెనుగొండ పట్టణ ప్రాంతాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు చేపట్టారు.

పెనుకొండ టౌన్ : పట్టణంలో సోమవారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలను జరుపుకున్నారు. ఉదయం స్థానిక ఈద్గా మైదానానికి ముస్లింలు పెద్ద ఎత్తున చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్‌ముబారక్ చెప్పుకున్నారు. అనంతరం పేదలకు కుర్బానీ(మటన్) పంపిణీ చేశారు.